క్లుప్తంగా

కోదండరామ్‌కు కార్మికుల వినతి



బోధన్‌టౌన్(బోధన్): జిల్లా కేంద్రానికి వచ్చిన కోదండరామ్‌ను నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులు అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం కలిశారు. ఫ్యాక్టరీని పునరుద్ధరించడంతోపాటు తమకు రావాల్సిన బకాయిలను ఇప్పించాలని విన్నవించారు. కోదండరామ్‌ను కలిసిన వారిలో కార్మికులు ఉపేందర్, దేవీదాస్, బాలకృష్ణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ పనులపై గ్రామసభ



కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం కొత్త పనులపై సర్పంచ్ అశోక్ అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. కాలువలు తీయడం, పొలాల మధ్యలో పిల్ల కాలువలు, రహదారుల నిర్మాణం తదితర అంశాలపై చర్చించి తీర్మానం చేశారు. కార్యదర్శి శ్రీనివాస్, ఉప సర్పంచ్ విక్రమ్, ఏఎస్‌ఎం విజయ, వార్డు సభ్యులు నీలిమ, శారద, గిరిజ, సాగర్, పోశన్న, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు, నాయకులు రమేశ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు

కుర్చీలు, టేబుళ్ల వితరణ



వేల్పూర్: మండలంలోని కుకునూర్ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సంస్థ ఆధ్వర్యంలో 10 కుర్చీలు, 2 టేబుళ్లను మంగళవారం అందజేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సంస్థ అధ్యక్షుడు పట్వారి గోపీకృష్ణ సొంతంగా కొనుగోలు చేసి ఇవ్వడం అభినందనీయమని హెచ్‌ఎం హరిచరణ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ సంస్థ కార్యదర్శి తులసి పట్వారి, రాజ్‌కుమార్, చరణ్‌రెడ్డి, దామోదర్, సురేశ్, గటాడి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టార్పాలిన్ల అందజేత



బాల్కొండ: ఐసీఐసీఐ ఫౌండేషన ఆధ్వర్యంలో మెండోరా మండలం వెల్కటూర్ గ్రామ రైతులకు రైతులకు మంగళవారం టార్పాలిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సామ గంగారెడ్డి మాట్లాడుతూ.. రైతుల కోసం ఐసీఐసీఐ ఫౌండేషన్ అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు 50 శాతం చెల్లిస్తే ఫౌండేషన్ 50 శాతం చెల్లిస్తుందని ఫౌండేషన్ ప్రతినిధి పాలెం ప్రవీణ్ తెలిపారు.

విద్యార్థులకు స్టేషనరీ..



బోధన్‌టౌన్(బోధన్): కోటగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బోధన్ పట్టణంలోని వెంకటేశ్వర జనరల్ స్టోర్ యజమాని మాశెట్టి మంగళవారం స్టేషనరీని అందజేశారు. 150 మంది విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందజేయడం అభినందనీయమని హెచ్‌ఎం శ్రీనివాస్‌రావు అన్నారు.

బోరుబావి తవ్వకం



నందిపేట్(ఆర్మూర్): నందిపేటలోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో జెడ్పీ నిధులతో మంగళవారం బోరుబావి తవ్వకం చేపట్టారు. స్థానిక నాయకుల అభ్యర్థన మేరకు జిల్లా పరిషత్ 15 వ ఆర్థికసంఘం నిధుల నుంచి జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు రూ.లక్ష కేటాయించారు. జెడ్పీ చైర్మన్‌కు సర్పంచ్ సాంబారు వాణి, ఉప సర్పంచ్ భరత్, వార్డు సభ్యులు ఆరుట్ల మంజుల, రమేశ్, మాజీ సర్పంచ్ మజారొద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.

మౌలిక వసతుల పరిశీలన

వర్ని (చందూర్): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్, ఘన్‌పూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను నాబార్డు జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. పాఠశాలల్లో మౌలిక వసతులను పరిశీలించిన అనంతరం డిజిటల్ క్లాసులను పర్యవేక్షించారు. హెచ్‌ఎంలు శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, సీఆర్పీ సాయిలు పాల్గొన్నారు.

ఇరుకు వంతెనతో ప్రమాదాలు

- భారీ వర్షాలకు దెబ్బతిన్న వంతెన
- జాతీయ రహదారిపై వాహనదారులకు ఇబ్బందులు



63వ నంబర్ జాతీయ రహదారిపై ఇరుకుగా ఉన్న వంతెన

వేల్పూర్: మండలంలోని లక్కోర వద్ద 63 నంబరు జాతీయ రహదారిపై ఇరుకు వంతెన కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కరీంనగర్, వరంగల్ జిల్లాలతోపాటు చుట్టు పక్కల మండలాలైన వేల్పూర్, భీమ్‌గల్, మోర్తాడ్, కమ్మర్‌పల్లి నుంచి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వేలాది వాహనాలు తిరిగే ఈ రహదారిపై లక్కోర వద్ద చెరువు కింద ఉన్న వంతెన ఈ ఏడాది జూలై 23న కురిసిన అతి భారీవర్షానికి ధ్వంసమైంది. వంతెన దెబ్బతినడమే కాకుండా వంతెనపై రోడ్డు మధ్యలో భారీ పగులు వచ్చింది. వంతెనను ఆనుకొని సుమారు 200 మీటర్ల రోడ్డు కోతకు గురైంది. మట్టిపోసి కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. పగుళ్లు వచ్చిన రహదారిపై వాహనాలు తిరిగితే ప్రమాదాలు జరుగుతాయని భావించిన అధికారులు వంతెనపై దెబ్బతిన్న రోడ్డుకు అడ్డంగా గోడ నిర్మించారు. దీంతో అక్కడ రోడ్డు ఇరుకుగా మారింది. ఒకవైపు భారీ వాహనాలు వెళ్లిన తరువాతే రెండోవైపు భారీ వాహనాలు వెళ్లాల్సి వస్తోంది. దీంతో వంతెన వద్ద వాహనాలు దాటిపోవడం కష్టంగా మారుతోంది. వాహనాలు ఏమాత్రం అదుపు తప్పినా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల ఇదే వంతెనపై కారు, రెండు బైకులు ఒకేసారి ఢీకొనగా వేల్పూర్, ముచ్కూర్‌కు చెందిన ఇద్దరి కాళ్లు విరగడంతోపాటు తీవ్ర గాయాలయ్యాయ. వేల్పూర్‌కు చెందిన మరో వ్యక్తి వెన్నుపూసకు గాయమైంది. కారు, బైకులు దెబ్బతిన్నాయి. వంతెన ఇరుకుగా ఉన్నట్లు దూర ప్రాంతాల వారికి, రాత్రిపూట కొత్తగా వచ్చేవారికి తెలియక వంతెనను ఢీకొనే ప్రమాదం ఉంది. భారీ వర్షాల వల్ల వంతెన, రోడ్డు ధ్వంసమై ఐదు నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాకపోకలకు వారధిగా ఉన్న జాతీయ రహదారి వంతెనను కూడా పట్టించుకోరా అని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే నూతన వంతెనను నిర్మించాలని కోరుతున్నారు.

కొత్త వంతెన నిర్మించాలి



లక్కోర వద్ద భారీ వర్షాలకు వంతెన దెబ్బతినడమే కాకుండా, రోడ్డుకు పగుళ్లు వచ్చి ఐదు నెలలైంది. రోడ్డు చాలా ఇరుకుగా మారింది. ప్రమాదాల్లో చాలా మంది గాయపడుతున్నారు. వెంటనే కొత్త వంతెన నిర్మించాలి. లేనిపక్షంలో పక్కనుంచి సర్వీసు రోడ్డును నిర్మించి రాకపోకలకు ఆటంకం లేకుండా చూడాలి.
– మాదాస్తు శ్రీనివాస్, లక్కోర

శుభ్రత కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో జానకమ్మ

రెంజల్(బోధన్): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుభ్రత పాటించాలని ఐసీడీఎస్ బోధన్ సెక్టార్ సీడీపీవో జానకమ్మ సూచించారు. రెంజల్ మండల కేంద్రంలో మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలతో మంగళవారం సమావేశమయ్యారు. ఆయా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. న్యూట్రిగార్డెన్ ద్వారా స్వచ్ఛమైన ఆకుకూరలను అందించేందుకు ప్రయత్నించాలని సూచించారు. టీచర్లతోపాటు ఆయాలు సమయపాలన పాటించాలని, రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. మండల సూపర్‌వైజర్ ప్రమీలారాణి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న వినయ్‌రెడ్డి

పెర్కిట్/నందిపేట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలంతోపాటు ఆలూర్, నందిపేట్ మండలాలకు చెందిన పలువురిని కాంగ్రెస్ నాయకుడు పొద్దుటూరి వినయ్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు తొడుశెట్టి శ్రీనివాస్ పెద్దనాన్న తొడుశెట్టి భూమన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, శ్రీనివాస్‌ను పరామర్శించారు. అలాగే ఆలూర్‌కు చెందిన సీనియర్ నాయుడు మల్లేశ్‌గౌడ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. నందిపేట్ మండలం సీహెచ్ కొండూర్‌కు చెందిన పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఇస్సాపల్లి సంజీవ్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో, అదే గ్రామానికి చెందిన గూండ్ల శ్యామ్ కొడుకు సాయిరాం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబాలను వినయ్‌రెడ్డి పరామర్శించారు. కుద్వాన్‌పూర్‌కు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు కోలుకొండ హన్మాండ్లు చిన్నకుమారుడు శ్రీకాంత్ మరణించగా, బాధితులను పరామర్శించారు. వినయ్‌రెడ్డి వెంట నిజాంసాగర్ ప్రాజెక్టు మాజీ చైర్మన్ యాల్ల సాయారెడ్డి, ఆయా మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు చిన్నారెడ్డి, ముక్కెర విజయ్, మంద మహిపాల్, ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలి

- వేల్పూర్ మండల సమావేశంలో తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భీమజమున

వేల్పూర్: మండలంలోని ప్రతి గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని మండల పరిషత్ సమావేశంలో సభ్యులు తీర్మానించారు. ఎంపీపీ భీమజమున అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం కల్పిస్తున్నప్పటికీ.. బస్సు సౌకర్యం లేని గ్రామాలవారు ఉచిత ప్రయాణానికి నోచుకోవడం లేదన్నారు. మండలంలో అన్ని గ్రామాలకు మంచి తారు రోడ్లు ఉన్నాయన్నారు. గతంలో రోడ్లు బాగులేక బస్సులు రాకపోయేవని, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రహదారులు, భవనాల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు మండలంలో చాలా గ్రామాలకు డబుల్‌రోడ్లు వేయించడంతోపాటు మిగతా గ్రామాల రోడ్లకు మరమ్మతులు చేయించారన్నారు. యాసంగి రైతుబంధు డబ్బులు రైతులందరికీ వెంటనే రాష్ట్రప్రభుత్వం విడుదల చేయాలని, ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. వైద్యం, విద్య, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఐసీడీఎస్, ట్రాన్స్‌కో తదితర శాఖలపై చర్చించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బోజపల్లి సురేశ్, ఎంపీడీవో కమలాకర్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎడ్ల రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించుకోవాలి

బోధన్‌టౌన్(బోధన్): విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులను విద్యుత్ వినియోగదారుల ఫోరంలో పరిష్కరించుకోవాలని ఫోరం చైర్మన్ రామకృష్ణ అన్నారు. పట్టణంలోని రాకాసీపేట్‌లో ఉన్న విద్యుత్ సెక్షన్ కార్యాయలంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించి వినియోగదారుల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. విద్యుత్ సరఫరాలో తరచూగా వచ్చే అంతరాయాన్ని, విద్యుత్ హెచ్చుతగ్గుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. విద్యుత్ మీటర్లకు సంబంధించిన సమస్యలతోపాటు మీటరు ఎక్కువ తిరగడం, నిలిచిపోవడం వంటి సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారమార్గాలు చూపుతామని, విద్యుత్ బిల్లు ఎక్కువగా వస్తే తగ్గించేలా చర్యలు చేపడుతామన్నారు. ఫోరం ప్రతినిధులు కిషన్, రాజాగౌడ్, డీఈ ముక్తార్ అహ్మద్, ఏడీఈ లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

టీఎస్ఎమ్మార్పీఎస్ నుంచి బహిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బోధన్‌టౌన్(బోధన్): టీఎస్ఎమ్మార్పీఎస్ నుంచి మందుగుల విద్యాసాగర్‌ను బహిష్కరిస్తున్నామని సభ్యులు తెలిపారు. బోధన్ పట్టణంలో టీఎస్ ఎమ్మార్పీఎస్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. టీఎస్ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, కోర్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్న మందుగుల విద్యాసాగర్ నియోజకవర్గంలోని మండల, పట్టణ నాయకులను, కార్యకర్తలను భయాభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. విద్యాసాగర్‌కు టీఎస్ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆయన ఉద్యోగ సంఘంలో మాత్రమే పని చేయాలని, మండల, పట్టణ కార్యక్రమాల్లో పనిచేయొద్దని సూచించారు. ఇకపై టీఎస్ఎమ్మార్పీఎస్ మండల, పట్టణ నాయకులను ఇబ్బంది పెట్టవద్దన్నారు. సమావేశంలో టీఎస్ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మల్ల సాయిలు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకారం యాదయ్య, పట్టణ అధ్యక్షుడు అద్దంకి లింగయ్య, రాష్ట్ర కార్యదర్శి డప్పుల చంద్రయ్య, రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ పోసాని, జిల్లా అధికారప్రతినిధి ఉప్పుల రామకృష్ణ, ఆయా మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదిమల్లన్న జాతర



వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో ఆదిమల్లన్న జాతరను మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తుల ఆరాధ్యదైవమైన ఆదిమల్లన్న స్వామిని దర్శించుకునేందుకు గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి రథోత్సవంలో పాల్గొన్నారు. పూజారులు సంప్రదాయబద్ధంగా పూజాకార్యక్రమాలు, రథోత్సవాన్ని నిర్వహించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



బాల్కొండ: జాతీయ రహదారిల వెంబడి ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని ఆర్మూర్ ట్రాఫిక్ సీఐ చందర్‌నాయక్ అన్నారు. మంగళవారం ముప్కాల్ మండల కేంద్రం శివారులో పాతజాతీయ రహదారిపై రోడ్డుప్రమాదల జోన్‌ను పరిశీలించారు. రోడ్డుకిరువైపులా ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలిగించాలన్నారు. రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చాలన్నారు. ఆయన వెంట ముప్కాల్ ఎస్సై భాస్కరాచారి, సిబ్బంది తదితరులున్నారు.

ఆరుగురికి వేసెక్టమి ఆపరేషన్లు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం వేసెక్టమి శస్త్రచికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఆరుగురు పురుషులు వేసక్టమి చేయించుకున్నారని జిల్లా వైద్యాధికారి సుదర్శనం తెలిపారు. కత్తి, కుట్టులేని ఆపరేషన్‌తో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, వేసెక్టమి చేయించుకున్న వారు రెండు గంటల్లో ఇంటికి వెళ్ళి పోవచ్చని, ఎప్పటిలాగే రోజువారీ పనులు చేసుకోవచ్చని తెలిపారు. శిబిరంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, వైద్య సిబ్బంది రవి, నిర్మల, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత పశువైద్య శిబిరం

రుద్రూర్: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మండలంలోని సులేమాన్‌నగర్‌లో బుధవారం ఉచి త పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు పశువైద్యుడు సంతోష్‌రెడ్డి మంగళవారం తెలిపారు. చికిత్స నిమిత్తం పాడి పశువులు, ఆవులు, గేదెలను తీసుకురావాలని సూచించారు. పశుపెంపకందారులు ఉచిత వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బిగ్‌బాస్ విజేతను కలిసిన రైతులు



బిగ్‌బాస్ విన్నర్ పల్లవి ప్రశాంత్‌తో రైతులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ సొసైటీ డైరెక్టర్లు మంగళవారం సిద్దిపేటలో బిగ్ బాస్ సీజన్-7 విన్నర్ పల్లవి ప్రశాంత్‌ను కలిశారు. రైతుబిడ్డ అయిన పల్లవి ప్రశాంత్ బిగ్‌బాస్ షోలో గెలిచిన ప్రైజ్‌మనీతో రైతులకు చేయూతనందిస్తానని ఇదివరకు ప్రకటించారు. దీంతో పెర్కిట్ రైతులు పల్లవి ప్రశాంత్‌ను కలిసి అభినందించారు. ప్రశాంత్‌ను కలిసిన వారిలో పెర్కిట్ సొసైటీ డైరెక్టర్ మూడ అశోక్, మానేటి నికేతన్, నడ్కుడ నాగరాజు తదితరులున్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి



ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బోధన్ వీడీసీ ప్రతినిధులు



బాన్సువాడ ఎమ్మెల్యే పోచారంను సన్మానిస్తున్న ఘన్‌పూర్ గ్రామస్తులు

బోధన్‌టౌన్(బోధన్): గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యేలను ప్రజాప్రతినిధులు, నాయకులు కోరారు. బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డిని బోధన్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ బాగయ్యయాదవ్‌తోపాటు ప్రతినిధులు పట్టణంలో మంగళవారం కలిశారు. గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే ను కలిసిన వారిలో పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ హరికాంత్ చారి, గుండేటి రాములు, దాసు ఉన్నారు.

పోలీసులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం

బోధన్ నియోజకవర్గ పోలీసులతో పట్టణంలోని ఇరిగేషన్ గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్యే సమీక్షాసమావేశం నిర్వహించారు. నియోజక వర్గంలో శాంతి భద్రల విషయంలో పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధుల పట్ల నిర్లక్ష్య ధోరణిని వీడాలని ఎమ్మెల్యే పోలీసులకు సూచించినట్లు సమాచారం. సమావేశంలో ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ వీరయ్య పాల్గొన్నారు.

పోచారానికి సన్మానం..

వర్ని:(చందూర్): మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు మంగళవారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. సర్పంచ్ గంగారాం, మాజీ సర్పంచ్ చందర్‌నాయక్, బీఆర్ఎస్ మండల కార్యదర్శి చందర్, ప్రచార కార్యదర్శి లాలబోయి, మాజీ ఉపసర్పంచ్ గైని సాయిగౌండ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

నవీపేట: రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో తాము ఉపాధి కోల్పోయామని, తమను ఆదుకోవాలని ఆటో డ్రైవర్లను కోరారు. ఈ మేరకు మంగళవారం ఆటో ఫెడరేషన్ యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. నవీపేటలోని వీధుల్లో ర్యాలీ నిర్వహించి, చౌరస్తాలో రాస్తారోకో చేశారు. అనంతరం తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. ఒక్కో ఆటో కార్మికుడికి నెలకు రూ.20 వేల భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆటోలపై ఉన్న ఫైనాన్స్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో ఫెడరేషన్ యూనియన్ మండల ప్రతినిధులు ఫకీరా, మానికొల్ల గంగాధర్, వీరేందర్, అర్జున్, సాయిలు, శ్యామ్, రాజారాం, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



నవీపేటలో రాస్తారోకో చేస్తున్న ఆటోడ్రైవర్లు

రేపటి నుంచి ధ్యాన మహాయజ్ఞం



నందిపేట్(ఆర్మూర్): విశ్వ శాంతి, సమాజహితం కోసం రంగారెడ్డి జిల్లా మహేశ్వర మహా పిరమిడ్ ప్రతీజీ శక్తి స్థల్ కడ్తాల్‌లో ఈనెల 21నుంచి 11రోజులపాటు ధ్యాన మహాయజ్ఞం నిర్వహించనున్నట్లు పీఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షుడు, అడ్వొకేట్ సాయికృష్ణారెడ్డి తెలిపారు. మహాయజ్ఞానికి వచ్చే భక్తులకు ఉచిత భోజనంతోపాటు వసతి సదుపాయం ఉంటుందని తెలిపారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

దుప్పట్లు, రగ్గుల పంపిణీ



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని షెడ్యూల్ కులాల సాంఘిక సంక్షేమ వసతిగృహం విద్యార్థులకు వార్డెన్ కిషన్ దుప్పట్లు, రగ్గులను మంగళవారం పంపిణీ చేశారు. 40 రగ్గులు, 50 దుప్పట్లు, స్వెట్టర్లు, స్లిప్పర్లు, మంకీక్యాపులు, లెదర్ బూట్లు, రెండు జతల సాక్స్ అందజేసినట్లు ఆయన తెలిపారు. వసతిగృహం సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ వితరణ



మోర్తాడ్: మండలంలోని పాలెం ప్రాథమికోన్నత పాఠశాలకు సుంకం రాములు, ఆండాలమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు కంప్యూటర్‌ను మంగళవారం అందజేశారు. దాతలను ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనర్సయ్య అభినందించారు. ఉపాధ్యాయులు మాణిక్యం, రాములు, విశాల్, శ్యాంచరణ్, సాగరిక, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్లను నియమించండి



భీమ్‌గల్ : మండలంలోని బెజ్జోర గ్రామ జెడ్పీహెచ్‌ఎస్‌లో గణితం, బయోలజీ టీచర్లను నియమించాలని కోరుతూ ఎస్ఎఫ్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు సయ్యద్ రెహమన్ ఎంఈవో స్వామికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. యూనియన్ మండల అధ్యక్షుడు పవన్‌రెడ్డి, ప్రణీత్, సాయి, లక్కీ, నిహాల్ పాల్గొన్నారు.

శాస్త్ర, సాంకేతిక నమూనా తయారీ పోటీలు

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 21న జిల్లాస్థాయి శాస్త్ర, సాంకేతిక నమూనా తయారీ పోటీలను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ టి రమేశ్ మంగళవారం తెలిపారు. మెకానిక్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులకు పోటీలు ఉంటాయని, ఉత్తమ నమూనాను ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపిస్తామన్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రదర్శనను తిలకించాలని కోరారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – చే లాంగ్‌లీవ్(తెలుగు)-12.50
జోరుగా హుషారుగా (తెలుగు)- 3.40, 6.40
కలశ(తెలుగు)- 9.45
స్క్రీన్-2 – హాయ్ నాన్న (తెలుగు)- 12.00, 03.15, 6.30, 09.45
స్క్రీన్-3 – తికమక తండా (తెలుగు)- 12.15, హాయ్ నాన్న - 2.45
ఎక్స్‌ట్రా ఆర్డినరీ మెన్ -06.00
పిండం (తెలుగు) - 09.20
స్క్రీన్-4 – యానిమల్(తెలుగు)- 10.00, 2.00, 6.00, 9.00